క్లుప్తంగా

నేడు సచివాలయ కన్వీనర్లతో సమావేశం

సత్యవేడు: నియోజకవర్గస్థాయిలో సచివాలయ కన్వీనర్లు(జేసీఎస్ కన్వీనర్లు), వైఎస్సార్ సీపీ నాయకులతో స్థానిక బేరిశెట్టి కల్యాణ మండలంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఉంటుందని మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, విధి విధానాలు చర్చిస్తామన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు రూ.10 లక్షల బీమాను కల్పించే అంశంపై చర్చించనున్నారు. కార్యక్రమానికి అందరూ తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బస్సు ప్రారంభం



బస్సు వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులు

ఏర్పేడు: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ సర్వీసు ప్రారంభమైంది. బుధవారం మండలంలోని పాపానాయుడుపేట, రావిళ్లవారికండ్రిగ, పెనుమల్లం మీదుగా తిరుపతికి బస్సు నడిచేలా చర్యలు తీసుకున్నారు. ఏడాదిగా ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన స్పందించి, ఆర్టీసీ అధికారులతో మాట్లాడి, బస్సును ఏర్పాటు చేయించారు. రోజూ ఉదయం, సాయంత్రం ఈ బస్సు ఈ మార్గంలో నడుస్తుందని చెప్పారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

భూముల రీసర్వేకు సహకరించండి



భూమి వివరాలను పరిశీలిస్తున్న వీఆర్‌ఓం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లి గ్రామ రెవెన్యూలో చేపట్టిన భూముల రీసర్వేకు సహకరించాలని వీఆర్‌ఓ సుధ తెలిపారు. ఆమె బుధవారం పార్లపల్లి గ్రామంలోని భూముల రీసర్వే చేపట్టారు. గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల రీసర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. భూముల రీసర్వే ద్వారా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సాగులో ఉన్నవారి పేరుపై భూమికి పాసుపుస్తకాలు వస్తాయని, ఆన్‌లైన్‌లో వారి పేరు నమోదు అవుతుందన్నారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న వరిపంట



కనమనంబేడులో నీట మునిగిన వరిపంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో బుధవారం సింగిల్‌విండో చైర్మన్ హరనాథరెడ్డి నెల్లూరు టౌన్‌లో కురిసిన భారీ వర్షానికి వరిపంట దెబ్బతింది. మండలంలోని పల్లమాల, కాటూరు, కనమనంబేడు గ్రామాల్లోని సుమారు 150 ఎకరాల్లోని వరిపంట నీట మునిగి దెబ్బతినింది. కోతదశకు చేరుకున్న వరిపంట అకాలవర్షంతో నేలకొరిగింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో అకాలవర్షంతో తీవ్రంగా నష్టపోయామని, అప్పులు చేసి పెట్టిన వరి పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎర్రమరెడ్డిపాళెం రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలం ఎర్రమరెడ్డిపాళెం గ్రామ రైతులు దీర్ఘకాలంగా సాగుచేసుకుంటున్న భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. ఆమె బుధవారం రైతులతో కలిసి తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు.

కంటి వైద్య శిబిరం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.అనన్య ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ భారతి మాట్లాడుతూ కంప్యూటర్లు, మొబైల్ ఫోన్స్ ఎక్కువగా వినియోగిస్తున్నందున తరచూ కంటి సమస్యలు తలెత్తుతాయన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- గాజులమండ్యంలో వలంటీర్లకు యూనిఫాం పంపిణీ



లబ్ధిదారులు పొందిన లబ్ధి గణాంకాలతో ఉన్న సమాచార బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి సంక్షేమ బుక్‌లెట్ ఇస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రేణిగుంట: అర్హత ఉన్న ప్రతి నిరుపేదకూ ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం సాయంత్రం ఆయన మండలంలోని గాజులమండ్యం పంచాయతీ జీవాగ్రం, బాలాజీనగర్, గాజులమండ్యం దళితవాడలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన వివిధ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎవరైనా అర్హులైనప్పటికీ సాంకేతిక కారణాల చేత పథకాల లబ్ధి పొందని పక్షంలో వారి ఫిర్యాదులను ప్రత్యేకంగా స్వీకరించి 'ప్రజాద ర్బారు' కార్యక్రమంలో పరిష్కరిస్తామన్నారు. అలాగే గ్రామంలో మౌలిక వసతుల మెరుగు పరిచేందుకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటా నవరత్నాలతో ఒక్కొక్క పేద కుటుంబం మూడేళ్లలో సగటున రూ.4లక్షల నుంచి రూ.8 లక్షల వరకు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు కూడా ఆలోచన చేయాలని, గతంలో ఏ ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు నేరుగా పేదల ఖాతాల్లో నగదు వేసి, వారికి ఆసరాగా నిలిచిన దాఖలాలు లేవన్నారు. ఎవరి ప్రమేయం ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే పథకాల ఫలాలు, సేవలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని, దీనిని గుర్తెరిగి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని, జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో వివిధ పథకాల రూపేణా ఎంతెంత లబ్ధి పొందారో వారి వివరాలతో కూడిన బోర్డులను ఆయన ఆవిష్కరించడంతో ప్రజలు ఆసక్తిగా వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీలు వెంకటరమణారెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, మోహన, వేణు, ప్రవీణ్, లోకేష్, హరి, మునిశేఖర్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, యోగేశ్వరరెడ్డి, ఖదీర్, ఆనందరావు, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో కలిసి తుడా చైర్మన్ పర్యటన

ఇదే రోజు రాత్రి గాజులమండ్యం దళితవాడలో ఎమ్మెల్యేతో కలిసి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతోపాటు ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. తుడా చైర్మన్‌గా నియామకం కావడంతో ఎమ్మెల్యే ఆయన్ను సన్మానించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చురుగ్గా పాల్గొంటున్నారని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ తనకంటూ ప్రత్యేకతను ఆయన చాటుతున్నారని మోహిత్‌రెడ్డి చెప్పారు. ఆయన స్ఫూర్తితో తామూ ముందుకు నడుస్తామన్నారు.

కుంభాభిషేకం వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరిలో విజయ గణపతి ఆలయ కుంభాభిషేకం వాల్ పోస్టర్లను బుధవారం శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆవిష్కరించారు. విరాళాలతో గ్రామస్తులు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించే కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనాలని ఎమ్మెల్యే, ఎంపీని సర్పంచ్ మునిరామయ్య, గ్రామపెద్దలు ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ కావేరి తిరుమలయ్య, వైస్ ఎంపీపీ జమ్మళ శ్రీనివాసులు, పార్టీ నాయకులు గురునాథం, కేశవులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆదిమూలం అసంతృప్తి

కేవీబీపురం: ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకంతో పాటు వ్యవసాయ, ఉద్యానవనశాఖల ద్వారా లక్షల మంది పూర్తి లబ్ధిని పొందుతున్నారని, అయితే వాటిని స్థానిక నేతలు, అధికారులు ప్రజలకు క్లుప్తంగా వివరించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఎంపీపీ మునిలక్ష్మి అధ్యక్షతన బుధవారం కేవీబీపురం మండలంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ద్వారా మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాలకు గానూ రూ.2.76 కోట్లు చొప్పున ఏటా రైతులకు రైతు భరోసా రూపంలో అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా సున్నా వడ్డీ పంట రుణాల ద్వారా మండలంలోని 85 మంది రైతులకు పంట సాగు అనంతరం రూ.2.47 లక్షలు అందించామన్నారు. 19 రైతుల గ్రూపులకు 19 ట్రాక్టర్లను అందించామని వ్యవసాయశాఖ ఏఓ తెలిపారు. ఉద్యానవన పంటల ద్వారా ఎకరాకు రూ.8 వేలు సబ్సిడీతో పండ్లు, పూలతోటల రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించిందని అధికారులు తెలిపారు. 200 ఎకరాలకు పైగా సబ్సిడీ పద్ధతిలో వందమందికి పైగా రైతులకు డ్రిప్ ఇరిగేషన్ అందించి ఉద్యానవన పంటలను ప్రత్యక్షంగా ప్రోత్సహించామని తెలిపారు. ఎంఈఓ లక్ష్మీపతి మాట్లాడుతూ గత నాలుగేళ్లల్లో ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థుల సంఖ్య గతంలో కన్నా 3.9 రెట్లు వృద్ధి చెందినట్లు తెలిపారు. నాడు-నేడు పనుల ద్వారా రెండో విడతగా 12 స్కూళ్లను ఎంపిక చేసినట్లు ఎంఈఓ తెలిపారు. జగనన్న విద్యాకానుక ద్వారా 2,816 మందికి విద్యాకానుక కిట్లను అందజేశామన్నారు.

పని తీరు మార్చుకోండి

ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా సంక్షేమ పథకాలు అందించి ఆదుకుంటున్నప్పటికీ అధికారులు ఎక్కడో ఒక దగ్గర కొంత నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి అయినా నిర్లక్ష్యానికి స్వస్తి పలికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

రైతులను వేధిస్తే పోరాటానికి సిద్ధం

మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో పూర్వీకుల నుంచి సాగులో ఉన్న భూములను అటవీశాఖ అధికారులు రిజర్వు ఫారెస్టుగా చూపిస్తూ ఆయా భూముల్లో కందకాలు తవ్వి, ప్రశ్నించిన రైతులపై దాడులకు దిగుతున్నారని ఎమ్మెల్యే ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని అసెంబ్లీలో పలు సందర్భాల్లో మంత్రులతో ప్రత్యేకంగా చర్చించామన్నారు. అయినా అటవీశాఖ అధికారులు రైతులను పూర్తిగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు రైతులపై వేధింపులు ఆపకపోతే రైతులతో పాటు కలిసి పోరాటాల్లో పాల్గొనేందుకు తాను కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, జెడ్పీటీసీ మునెమ్మ, నేతలు నందకుమార్, లాలు బాబుయాదవ్, వైస్ ఎంపీపీ సరస్వతి, శ్రీనివాస్ యాదవ్, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దారు శ్రీదేవి, ఎంఈఓ లక్ష్మీపతి, ఏఎస్‌ఐ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలంతో తుడా చైర్మన్

నారాయణవనం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం సాయంత్రం ఆయన స్వగృహంలో పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం కూడా తుడా చైర్మన్ మోహిత్ రెడ్డిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తుడా పరిధిలోని సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన తుడా చైర్మన్‌ను కోరారు. ప్రతిష్టాత్మకంగా ఆర జీయార్ ప్రాజెక్టులో తుడా నిధులతో చేపడుతున్న టూరిజం పనులను వేగవంతం చేయాలని, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న కైలాసనాథకోన అభివృద్ధికి సహకరించాలని మోహిత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.



ఉద్యోగాల్లో స్థానికులకు అవకాశం ఇవ్వాలని వినతి



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం ఇస్తున్న హరనాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో కొత్తగా ఇచ్చే ఉద్యోగాల్లో స్థానికులకు అవకాశం కల్పించాలని ఐటీడీఏ కార్యాలయంలోని ప్రాజెక్టు ఆఫీసర్ రాణిమందకు వినతిపత్రం ఇచ్చారు. బుధవారం సింగిల్‌విండో చైర్మన్ హరనాథరెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరుకు వెళ్లి ఆమెను కలిసి విన్నవించారు. ఏకలవ్య పాఠశాల కోసం గ్రామంలోని పశువుల మేత పోరంబోకు భూమిలో నిర్మించడానికి గ్రామస్తులంతా సహకరించారని, కనుక పాఠశాలలో ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రాజెక్టు ఆఫీసర్ రాణిమంద మాట్లాడుతూ పాఠశాలలో కొత్తగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చినప్పుడు తప్పకుండా స్థానికులకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు పితృ వియోగం



జయరామిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాగోలు శ్రీనివాసులు తండ్రి నాగోలు జయరామిరెడ్డి(82) బుధవారం మృతి చెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నారు. నాగోలు కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎంపేడులో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీచర్లకు ఆత్మీయ సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, అలాగే వారి స్థానంలో బాధ్యతలు స్వీకరించిన టీచర్లకు ప్రధానోపాధ్యాయురాలు సజ్జల విమల కుమారి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి వీడ్కోలు, స్వాగతం పలికారు. సుదీర్ఘకాలం ఇక్కడ పనిచేస్తూ పుదుకుప్పం (సత్యవేడు మండలం) తమిళ మీడియం హైస్కూలుకు బదిలీపై వెళ్లిన వ్యాయామోపాధ్యాయురాలు కె.గ్రేస్ ప్రతిమ, సోషల్ ఉపాధ్యాయుడు రవీంద్రరెడ్డి (గోవర్ధనపురం), ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు జ్యోతి(అంజూరు), పీఎస్ ఉపాధ్యాయుడు వెంకటయ్య(గోవర్ధనపురం)లకు.. బదిలీపై చెరివి, రాజగోపాలపురం, కంచరపాలెం, కుప్పం నుంచి వచ్చిన టీచర్లు భార్గవి, సోమ, అన్నపూర్ణ, ఫిజికల్ డైరెక్టర్ మహేష్‌బాబులకు బుధవారం పాఠశాలలో శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. బదిలీ అయిన టీచర్లు, పీఈటీ సేవలను హెచ్‌ఎం, టీచర్లు కొనియాడారు. బాధ్యతలు స్వీకరించిన వారు ఆ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



శ్రీకాళహస్తి: భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక పాతబస్టాండు కూడలి వద్ద ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించారు. బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, వేడాం కృష్ణయ్య, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసరావు



అదవికొడియంబేడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పిచ్చాటూరు: సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికల సమయంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని అడవికొడియంబేడులో ఈ నెల 19న జరిగే సర్పంచ్ ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీలో మొత్తం 1033 ఓట్లు ఉన్నాయని, ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలింగ్, కౌంటింగ్ పూర్తయ్యే వరకు గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. నిఘా పటిష్టం చేశామని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పోలింగ్ లోపల, బయట పరిశీలించి తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై అక్కడే ఉన్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లుతో చర్చించారు.

నోటు పుస్తకాల వితరణ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

వరదయ్యపాళెం: మండలంలోని రాచర్లలో ఏర్పాటైన అమ్మానాన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు సేవ చేస్తామని ట్రస్ట్ నిర్వాహకులు శేఖర్, సుమలత దంపతులు తెలిపారు. బుధవారం సాయంత్రం గ్రామస్తుల సమక్షంలో ట్రస్టును ఆవిష్కరించి రాచర్ల గిరిజన విద్యార్థులకు నోటు పుస్తకాలను వితరణ చేశారు. విడతల వారీగా ఆపదలో ఉన్న పేద వర్గాలను ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి, సింగిల్‌విండో సీఈఓ సంపత్, గ్రామ పెద్దలు భూషణం, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దారు మధుసూదన్ రావు

పిచ్చాటూరు: మండలంలో జరుగుతున్న సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుందామని తహసీల్దారు మధుసూదన్ రావు తెలిపారు. బుధవారం సాయంత్రం మండలస్థాయి అధికారుల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ స్థానానికి ఎన్నికలు జరిగే అడవికొడియంబేడు గ్రామంలో 1033 ఓట్లు ఉన్నాయని, గోవర్ధనగిరి 7వ వార్డులో 114 ఓట్లు ఉన్నట్లు ఆయన వివరించారు. 17న గురువారం 5 గంటలతో ప్రచారపర్వం ముగుస్తుందన్నారు. పోలింగ్, కౌంటింగ్ సమయాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, సామగ్రి, బందోబస్తు అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దారు వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై అప్రమత్తం

తిరుపతి సిటీ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చిరుత సంచారం వార్తల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని వీసీ రాజారెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన పరిపాలన భవనంలో వర్సిటీ అధికారులతో సమావేశమయ్యారు. చిరుత విషయంలో టీటీడీ తీసుకుంటున్న కట్టుదిట్టమైన ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యార్థులు, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

జాతరను తలపిస్తున్న 'జీఓ' సంబరాలు

- పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు



పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పోలేరమ్మ జాతరను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ జీఓ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ వెంకటగిరి మున్సిపాలిటీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో పలు వార్డుల్లో జరుగుతున్న పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, సంబరాలు జాతరను తలపిస్తున్నాయి. బుధవారం 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధమ్మ ఆధ్వర్యంలో పూజలు ఘనంగా చేశారు. తొలుత తూర్పువీధిలోని రాధమ్మ నివాసం వద్ద రాజా కుటుంబీకులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల్లో పోలేరమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైన పత్తిసాంగ్యం, వెయ్యికళ్ల దుత్తలతో ఆసాదుల తప్పెట్ల మధ్య పోలేరమ్మ ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. దీంతో పట్టణంలో ముందస్తు పోలేరమ్మ జాతర వచ్చిందా అన్నట్లు తలపించింది. పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, పూజారి లక్ష్మి, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, చింతపట్ల ఉమామహేశ్వరి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉప ఎన్నికల ప్రచారం



అదవికొడియంబేడులో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్న అభ్యర్థి కిరణ్‌కుమార్



నారాయణరాజు కండ్రిగలో ప్రచారం చేస్తున్న వార్డు మెంబరు అభ్యర్థి బాలసుబ్రమణ్యం రాజు

పిచ్చాటూరు: వివిధ కారణాలతో ఖాళీ అయిన పలు సర్పంచ్, వార్డుమెంబర్ల స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. మండలంలోని అడవికొడియంబేడు సర్పంచ్ కె.పుష్పవతి గతేడాది ఫిబ్రవరిలో గుండెపోటుతో మరణించారు. ఆమె స్థానంలో ఆమె తనయుడు కిరణ్‌కుమార్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. బుధవారం ఆయన ఓటర్లను కలిసి తనను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. అలాగే మండలంలోని గోవర్ధనగిరి పంచాయతీ 7వ వార్డు సభ్యుడిగా తనను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థి బాలసుబ్రమణ్యం రాజు ప్రచారం చేశారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజేంద్ర, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, సింగిల్‌విండో మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, నాయకులు చలపతిరాజు, మోహన్, సుబ్రమణ్యం, రామచంద్రా రెడ్డి, విశ్వనాథం, శేఖర్, చంద్రన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



నీర్పాకోట ఆర్‌బీకేలో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు ఏఓ భారతి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను పంట పొలాల్లో సాగు చేయడం వల్ల భూమిలో సత్తువ పెరుగుతుందని తెలిపారు. 10 కేజీల జీలుగ ధర రూ.790, కాగా 50 శాతం రాయితీపై రూ.395కు, 10 కేజీలు జనుములు రూ.840 కాగా 50 శాతం రాయితీపై రూ.420కు, పిల్లిపెసర 10 కేజీలు రూ.970, కాగా 50 శాతం రాయితీపై రూ.485కు పంపిణీ చేస్తున్నామన్నారు. వీటిని బయోమెట్రిక్ విధానంలో రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. జనుము, జీలగలు, పిల్లిపెసర కావలసిన రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాసుపుస్తకాలు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ కోసం తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి స్పందన



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రేణిగుంట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, విష రహిత ఆహార పదార్థాలను తీసుకుని క్యాన్సర్‌కు దూరంగా ఉండి క్యాన్సర్ రహిత భారతావని నిర్మాణానికి కృషి చేయాలని ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దాల రవిబాబు కోరారు. మండలంలోని కృష్ణాపురం పంచాయతీ దిగువ మల్లవరంలో బుధవారం టాటా ట్రస్ట్ సహకారంతో ఆకాంక్ష సంస్థ ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించింది. క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన తక్కువగా ఉంటుందని, ముఖ్యంగా మహిళల్లో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. చిన్నపాటి అనుమానం కలిగినా వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ హేమంత్‌కుమార్, ఆకాంక్ష సంస్థ సభ్యుడు కోదండరామిరెడ్డి, నాగశంకర్, ఆయేషా, రెడ్డికుమారి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు .